RNI-TELTEL/2017/72695

# శుభ తెలంగాణ

1 ఆగస్టు 2023

మంగళవారం | మేడ్చల్

ఎడిటర్: ఎన్ సీ శేఖర్

సంపుటి : 6, సంచిక :147

వెల: 4 రూ/.

Website: www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

## కేటీఆర్... ఇంత విధ్వంసం జరుగుతుంటే

## సమీక్ష చేసే టైమ్ లేదా?

వరద బాధిత కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సాయం చేయాలని కేటీఆర్‌కు లేఖ

ప్రజలు రోడ్ల మీదకు రావాలంటే ఆలోచిస్తున్నారన్న రేవంత్

మళ్లీ రెడ్ అలర్ట్ ప్రకటించినా ముందస్తు జాగ్రత్తలేవని ప్రశ్న?

వివరాలు 2లో..





## రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం..

## టీఎస్ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం

- ప్రజారవాణాను పటిష్టం చేసేందుకు ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం..
- శాసన సమావేశాల్లోనే బిల్లు : మంత్రి కేటీఆర్
- రూ.60వేలకోట్లతో హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ..!
- జేబీఎస్ నుంచి తూంకుంట దాకా డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ : కేటీఆర్
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు ఖరారు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ప్రజారవాణాను పటిష్టం చేసేందుకు ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు తెలిపారు. తెలంగాణ కేబినెట్ అనంతరం మంత్రివర్గ నిర్ణయాలను మంత్రులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. 'రాష్ట్ర ప్రభుత్వ రోడ్డు రవాణా సంస్థ, అందులో పని చేసే ఉద్యోగులు, కార్మికుల విషయంలో రవాణామంత్రి, ఆర్థికశాఖ మంత్రి సంస్థతో అనుబంధం ఉన్న వారంతా సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. ఆర్టీసీ కార్మికులు చాలా రోజులుగా ఎదురుచూస్తున్న శుభవార్తపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నది. ఆర్టీసీని కాపాడేందుకు, ప్రజారవాణా వ్యవస్థను పటిష్టం చేసేందుకు, సేవలను ఇంకా విస్తృత పరిచేందుకు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులందరినీ ప్రభుత్వ

వివరాలు 2లో..

## కమిషన్ తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఒక్క రూపాయి కమీషన్ తీసుకున్నట్లు ఎవరైనా నిరూపిస్తే.. రాజకీయాల నుంచి వైదొలుగుతానని సవాల్ విసిరారు. రాజకీయాలంటే డబ్బులు సంపాదించే వ్యాపారం కాదని కేంద్ర మంత్రి గడ్కరీ అన్నారు. కులం, మతం, భాష

వివరాలు 2లో..

## ప్రతిపక్ష పార్టీలే పార్లమెంటులో చర్చ జరగకుండా పారిపోతున్నాయి

- సభకు వచ్చి.. చర్చలో పాల్గొనాలన్న మంత్రి అనురాగ్ ఠాకూర్
- ప్రతిపక్షాలు కోరిన అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్య
- పార్లమెంటుకు ఎన్నిక కావడం వల్ల ప్రయోజనం ఏంటని నిలదీత

వివరాలు 2లో..



## వచ్చే ఎన్నికల్లో ఓడిపోయి ప్రధాని మోదీ విదేశాల్లో స్థిరపడతారు



- 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతానని మోదీ ఆందోళనలో ఉన్నారని వ్యాఖ్య
- విదేశాల్లో ఆశ్రయం పొందాలని చూస్తున్నారన్న ఆర్జేడీ అధినేత
- అందుకే ఈ మధ్య ఎక్కువ విదేశాలు చుట్టొస్తున్నారని ఎద్దేవా చేసిన సీనియర్ నేత

వివరాలు 2లో..

## తెలంగాణను కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటోంది



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** బీజేపీ చేపట్టే ఏ పోరాటమైనా పాలమూరు నుంచే ప్రారంభించడం ఆనవాయితీ అన్నారు ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి. పాలమూరు నుంచే డబుల్ బెడ్రూమ్ సమస్యలపై నిరసన ర్యాలీ చేపట్టామన్నారు. ప్రజల సొమ్ముతో

వివరాలు 2లో..

## మంత్రి శ్రీనివాస్ గౌడ్ పై కేసు నమోదు చేయండి




**హైదరాబాద్(శుభ తెలంగాణ):** :మంత్రి శ్రీనివాస్ గౌడ్ కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు షాకిచ్చింది. మంత్రి శ్రీనివాస్ గౌడ్ పై ట్యాంపరింగ్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. మంత్రితో పాటు ఐఏఎస్ అధికారులపై కేసులు పెట్టాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులపై కూడా కేసులు పెట్టాలని ఆదేశించింది

వివరాలు 2లో..

## అసెంబ్లీ సమావేశాలు కనీసం 30 రోజులు నడపాలి



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** అసెంబ్లీ సమావేశాలు 30 రోజుల పాటు నిర్వహించాలన్నారు బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు. సీఎం కేసీఆర్ కు లేఖ రాసిన రఘునందన్ రావు.. 2014 నుంచి ఒక్క అసెంబ్లీ సెషన్ కూడా 30 రోజులు నడవలేదన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు తప్ప.. ప్రభుత్వానికి అందరూ మిత్రపక్షాలేనని అన్నారు. దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నందుకైనా అసెంబ్లీని కనీసం 30 రోజులు నిర్వహించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో

వివరాలు 2లో..

## జగన్ వైపే జనం మొగ్గు!

## 46% ఓట్లతో ముందంజ

ఇప్పటికిప్పుడు లోక్ సభ ఎన్నికలను నిర్వహిస్తే..

ఏపీ, తెలంగాణల్లో ఫలితాలు ఇలా ఉంటాయి:

ఇండియా టీవీ - సీఎన్‌ఎక్స్ సర్వే

వైసీపీ 18 సీట్లు, టీడీపీ 7 సీట్లు గెలుచుకుంటాయన్న సర్వే

వైసీపీ 4 సీట్లు కోల్పోతుందని వెల్లడి

తెలంగాణలో బీజేపీకి మరో 2 సీట్లు పెరుగుతాయన్న ఒపీనియన్ పోల్



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** దేశ వ్యాప్తంగా అప్పుడే సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలయింది. ఎన్నికల్లో గెలుపొందడమే లక్ష్యంగా అన్ని పార్టీలు వ్యూహ, ప్రతివ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇండియా టీవీ - సీఎన్‌ఎక్స్ సంస్థలు ఒపీనియన్ పోల్ నిర్వహించాయి. ఈ సర్వేలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు

వివరాలు 2లో..

## ఆగస్టు 10న మహిళలకు

## సున్నావడ్డీ కార్యక్రమం

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖపై సమీక్షలో సీఎం వైయస్.జగన్
- గ్రామాల్లో సమగ్ర భూసర్వేపై దృష్టిపెట్టాలి
- అర్బన్ ప్రాంతాల్లో కూడా డిజిటల్ లైబ్రరీల నిర్మాణంపై దృష్టిపెట్టాలన్న సీఎం
- చేయూత కింద స్వయం ఉపాధి పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి

వివరాలు 2లో..



**తాడేపల్లి (శుభ తెలంగాణ):** ఆగస్టు 10న మహిళలకు సున్నావడ్డీ కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖపై సీఎం వైయస్.జగన్ మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు సీఎం వైయస్ జగన్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సమగ్ర భూసర్వేపై దృష్టిపెట్టాలని, డిజిటల్ లైబ్రరీల నిర్మాణంపైనా దృష్టి పెట్టాలని

## కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజినీర్ కేసీఆరే

- తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు
- చాలా ప్రాంతాల్లో వరద పరిస్థితులు
- ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉందన్న భట్టి విక్రమార్క
- కేసీఆర్ రాత్రిపూట డిజైన్ చేసి మూడు చెక్ డ్యాముల ప్లాన్లు గీశారని వ్యంగ్యం
- కేసీఆర్ అనాలోచిత డిజైన్ల వల్ల ప్రజలు మునిగిపోతున్నారని ఆగ్రహం

వివరాలు 2లో..



# రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం.. టీఎస్ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం

- మొదటి పేజి తరువాయి
ఉద్యోగులుగా గుర్తిస్తూ.. విధివిధానాలు, నిబంధనలను రూపొందించేందుకు అధికారులతో కూడిన సబ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో ఆర్టీసీ కార్మికులు ఈ విషయంలో సమ్మె చేయడం జరిగింది. వారి కోరికను మన్నిస్తూ.. అదేవిధంగా సామాజిక బాధ్యతగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌గా గుర్తిస్తూ.. అధికారులతో కూడిన సబ్‌కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. మొత్తం 43,373 మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నది.సబ్ కమిటీలో అధ్యక్షుడిగా ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్అండ్‌బీ, రవాణాశాఖ, జేఏడీ శాఖ కార్యదర్శులు, కార్మికశాఖ స్పెషల్ సెక్రెటరీ సభ్యులుగా ఉంటారు. పూర్తి నివేదికను వెంటనే సిద్ధం చేసి.. ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుంది. 3వ తేదీన ప్రారంభమయ్యే సమావేశంలోనే ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియను ప్రారంభిస్తూ శాసనసభలో ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టనున్నది. వెంటనే దానికి సంబంధిన కార్యాచరణ ప్రారంభించాలని రవాణాశాఖ, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రికి సీఎం కేసీఆర్ ఆదేశాలు ఇవ్వడం జరిగింది' అని కేటీఆర్ తెలిపారు.
రూ.60వేలకోట్లతో హైదరాబాద్‌లో మెట్రోను విస్తరించనున్నట్లు ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ కల్వకుంట్ల తారకరామారావు వెల్లడించారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో కలిసి ఆయన కేబినెట్ నిర్ణయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయలాంటిది హైదరాబాద్ నగరం. భారతదేశంలోనే అద్భుతమైన నగరంగా ఎదిగింది. అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరాల్లో హైదరాబాద్ అగ్రభాగాన ఉంది. టార్చ్‌బేరర్‌గా ఉంది. పెరుగుతున్న నగరానికి మౌలిక సదుపాయాలు అంతే ఉండాలని సీఎం కేసీఆర్, కేబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రజారవాణాను విస్తృత పరచడం ద్వారా.. నగరం ఎంత పెరిగినా.. ఎన్ని పరిశ్రమలు వచ్చినా.. లక్షలాది మంది ప్రజలు వచ్చినా తట్టుకునేలా.. విశ్వనగరంగా ఎదగడానికి, అన్నిహంగులతో కూడిన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కేబినెట్ కీలక నిర్ణయం తీసుకున్నది. పురపాలకశాఖ మంత్రి సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నాను' అన్నారు.
ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి.. 43 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పెట్టనున్నారు. అంతేగాక, ఎమ్మెల్సీ అభ్యర్థులనూ కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఇద్దరు పేర్లను ఖరారు చేసింది. ఇటీవల పార్టీలో చేరిన దాసోజు శ్రవణ్, కుర్ర సత్యానారయణ పేర్లను ఖరారు చేశారు. అంతేగాక, హైదరాబాద్ మెట్రో విస్తరణపైనా చర్చించారు. రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు విస్తరించనున్నట్లు తెలిపారు. జేబీఎస్ నుంచి తూంకుంట వరకు డబుల్ డెక్కర్ బస్సులు నడపాలని నిర్ణయం తీసుకున్నారు. మియాపూర్ నుంచి లక్డీకపూల్ వరకు, ఎల్బీనగర్ నుంచి పెద్ద అంబర్ పేట్ వరకు, ఉప్పల్ నుంచి బీబీ నగర్ వరకు మెట్రో విస్తరింపజేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు.
ప్యాట్నీ నుంచి కండ్లకోయ దాకా డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్
'హైదరాబాద్ మెట్రో రైల్‌ను విస్తరిస్తున్నాం. విస్తృతమైన చర్చల తర్వాత రాబోయే మూడు నాలుగేళ్లలో నిర్దేశిత ప్రతిపాదనలతో చాలా పెద్ద ఎత్తున మెట్రోను విస్తరించాలని నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌కు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 70 కిలోమీటర్ల మెట్రోకు అదనంగా 31 కిలోమీటర్లు ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ రూపంలో అందుబాటులోకి రాబోతున్నది. కేబినెట్ తీసుకున్న నిర్ణయం మేరకు.. జూబ్లీ బస్టాండ్ వరకు తూంకుంట వరకు దాకా డబుల్ డెక్కర్ మెట్రోను ఏర్పాటు చేయబోతున్నది. ఒక లెవల్లో వాహనాలు, మరో లెవల్లో మెట్రో ఏర్పాటు చేయడానికి కేబినెట్ తీర్మానించింది. ప్యాట్నీ నుంచి కండ్లకోయ దాకా డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను నిర్మించాలని కేబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్‌లో మరో ముఖ్యమైన మార్గం ఇస్నాపూర్ %--% మియాపూర్ వరకు మెట్రోను విస్తరించాలని, మియాపూర్ నుంచి లక్డీకపూల్ వరకు, విజయవాడ రూట్‌లో ప్రస్తుతం ఉన్న మెట్రోను ఎల్‌బీనగర్ నుంచి పెద్ద అంబర్‌పేట వరకు హయత్‌నగర్ విస్తరించాలని, వరంగల్ రూట్‌లో ఉప్పల్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ వరకు, మహబూబ్‌నగర్ మార్గంలో భవిష్యత్‌లో కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు విస్తరించాలని నిర్ణయించింది. ఉప్పల్ నుంచి ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు వరకు, ఓల్డ్ సిటీ మెట్రోను పూర్తి చేస్తాం. ఓఆర్ఆర్ చుట్టూ ఎయిర్‌పోర్టు నుంచి కందుకూరు వరకు మొత్తం కలిపి రూ.60వేలకోట్లతో మెట్రోను రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నది' అన్నారు.

**కేంద్రం సహకరిస్తుందని ఆశిస్తున్నాం**

'నాలుగైదేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ పురపాలకశాఖను ఆదేశించారు. వీటిపై పూర్తిస్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేసి, వెంటనే ప్రభుత్వానికి అందజేయాలని సీఎం కేసీఆర్ మెట్రో రైల్ అథారిటీ, మున్సిపల్ శాఖను ఆదేశించారు. హైదరాబాద్ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రజా రవాణాను భారత్‌లోనే అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ సంకల్పం మేరకు పెద్ద ప్రాజెక్టును తీసుకోబోతున్నాం. కేంద్రం ప్రభుత్వం సైతం సహకరిస్తుందని ఆశిస్తున్నాం. సహాయం చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి చేస్తుంది. ఇప్పటికి కేంద్రం 2024 తర్వాత సంకీర్ణ ప్రభుత్వం వస్తుంది. అందులో బీఆర్ఎస్ కీలక పాత్ర ఉంటుంది. అందులోనైనా సాధించుకుంటామనే విశ్వాసం ఉంది. అలాగే మరికొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నది' అని తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజినీర్ కేసీఆరే

తెలంగాణలో భారీ వర్షాలు దంచి కొడుతున్నాయి. చాలా ప్రాంతాల్లో వరద పరిస్థితులు నెలకొన్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ముంపు ముప్పు ఎదుర్కొంటున్నారు. దీనిపై సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క బీఆర్ఎస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. భారీ వర్షాలు వస్తాయని ముందే హెచ్చరికలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో జరిగిన నష్టానికి ప్రభుత్వానిదే బాధ్యత అని స్పష్టం చేశారు. కేసీఆర్... రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులను రాజకీయ, ఆర్థిక అవసరాల కోసం కట్టారని భట్టి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇంజినీర్ కేసీఆరే అని అన్నారు. కేసీఆర్ రాత్రిపూట డిజైన్ చేసి, మూడు చెక్ డ్యామ్ లకు ప్లాన్లు గీశారని ఎద్దేవా చేశారు. అడ్డగోలుగా చెక్ డ్యాములు కట్టడం వల్లే ఇంతటి ప్రమాదం వచ్చిందని మండిపడ్డారు. కేసీఆర్ అనాలోచిత డిజైన్ల వల్ల ప్రజలు వరదల్లో మునిగిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని ఒక హెలికాప్టర్ అడిగితే స్పందించరు కానీ... రాజకీయ అవసరాల కోసం పొరుగు రాష్ట్రాలకు ప్రత్యేక విమానాలు పంపించి నాయకులను రప్పించి పార్టీ కండువాలు కప్పుతారని భట్టి విక్రమార్క విమర్శించారు. ప్రజలను మోసం చేయడం కేసీఆర్ కు అలవాటేనని అన్నారు. వరద ప్రాంతాలకు అధికారులను పంపి నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు.

## మంత్రి శ్రీనివాస్ గౌడ్ పై కేసు నమోదు చేయండి

- మొదటి పేజి తరువాయి
కోర్టు. కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు పంచుకోవద్దని సూచించింది. 2018 ఎన్నికల అఫిడవిట్ లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు రాఘవేంద్ర రాజు. అయితే ఈ పిటిషన్ కు విచారణ అర్హత లేదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే తన ఎన్నికను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టివేయాలన్న మంత్రి అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. మంత్రిపై వేసిన మహబూబ్ నగర్ ఓటర్ రాఘవేంద్ర రాజు వేసిన పిటిషన్ ను విచారణకు అనుమతించింది. రెండు పక్షాల వాదనలు విన్న హైకోర్టు మంత్రి వాదనను తిరస్కరిస్తూ, రాఘవేంద్ర రాజు పిటిషన్ ను విచారణకు అనుమతి ఇచ్చింది.

## జగన్ వైపే జనం మొగ్గు!

- మొదటి పేజి తరువాయి
సంబంధించి ఆసక్తికర అంచనాలు వెలువడ్డాయి. ఏపీలో వైసీపీ ఆధిక్యత కొనసాగుతుందని... అయితే, కొన్ని సీట్లను కోల్పోతుందని ఒపీనియన్ పోల్ తెలిపింది. ఇదే సమయంలో టీడీపీ పుంజుకుంటుందని వెల్లడించింది. ఏపీలోని మొత్తం 25 లోక్ సభ స్థానాలలో జగన్మోహన్ రెడ్డి పార్టీ 18 సీట్లను గెలుచుకుంటుందని తెలిపింది. గతంలో 22 సీట్లను గెలుచుకున్న వైసీపీ... ఇప్పటికిప్పుడు ఎన్నికలను నిర్వహిస్తే 4 సీట్లను కోల్పోతుందని చెప్పింది. ఇదే సమయంలో గత లోక్ సభ ఎన్నికల్లో కేవలం 3 సీట్లను మాత్రమే గెలుచుకున్న టీడీపీ... మరో 4 స్థానాలను కైవసం చేసుకుని... 7 స్థానాలను గెలుచుకుంటుందని తెలిపింది. తెలంగాణ విషయానికి వస్తే 17 లోక్ సభ స్థానాల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ 8 స్థానాలను గెలుచుకుంటుందని ఒపీనియన్ పోల్ వెల్లడించింది. బీజేపీ ఆధిక్యతను పెంచుకోబోతోందని... కాషాయం పార్టీకి 6 సీట్లు వస్తాయని తెలిపింది. కాంగ్రెస్ రెండు, ఎంఐఎం ఒక స్థానంలో విజయం సాధిస్తాయని తెలిపింది. సర్వే ప్రకారం బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కో సీటును కోల్పోనున్నాయి. బీజేపీ 2 సీట్లను పెంచుకోనుంది. అయితే రాబోయే రోజుల్లో వివిధ పార్టీల మధ్య పొత్తులు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతాయని వెల్లడించింది.

## తెలంగాణను కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటోంది

- మొదటి పేజి తరువాయి
ముఖ్యమంత్రి కేసీఆర్ 10 ఎకరాల్లో ఇల్లు కట్టుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కు కావడంతోనే కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు భూములు ఇస్తున్నారని, పాలమూరులో మాత్రం నిరుపేదలకు ఇండ్లు కట్టించడం లేదన్నారు. అర్హులైన నిరుపేదలకు తక్షణమే డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. మహబూబ్ నగర్ లో బీజేపీ పార్టీ నిరసన ర్యాలీకి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో పాటు రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, తల్లోజు ఆచారి, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహబూబ్ నగర్ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ నుంచి గడియారం చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇచ్చిన హామీలను తొమ్మిదేళ్ల నుంచి కేసీఆర్ విస్మరిస్తూ వస్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన రేషన్ కార్డులే ఇప్పటికీ ఉన్నాయని, కేసీఆర్ సర్కారు మాత్రం కొత్తగా అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటోందని ఆరోపించారు. దళితులకు వెన్నుపోటు పొడిచి సీఎం పీఠంపై కూర్చున్న ఘనత కేసీఆర్ దే అన్నారు. తొమ్మిదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు. 30 లక్షల మంది నిరుద్యోగ యువతీ, యువకులు ఆకలిమంటల్లో ఉన్నారని వ్యాఖ్యానించారు. పేపర్ లీకేజీ కారణంగా నిరుద్యోగులు తీవ్ర ఆవేదనలో ఉన్నారన్నారు.
ప్రజలను మోసం చేసిన చరిత్ర కేసీఆర్ దే అన్నారు కిషన్ రెడ్డి. రైతురుణ మాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. బంగారు తెలంగాణ దేవుడెరుగు..కేసీఆర్ కుటుంబం బంగారమైందన్నారు. తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజలను మోసం చేయటం కోసమే కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ పెట్టారని ఆరోపించారు. రాష్ట్రాన్ని లిక్కర్ తెలంగాణ, అప్పుల తెలంగాణగా కేసీఆర్ మార్చారని ఆరోపించారు. తెలంగాణలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నిస్తే ప్రతిపక్షాల మీద కేసులు పెడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కుటుంబ పార్టీలే అని, వాటి డీఎన్ఏ కూడా ఒక్కటే అని వ్యాఖ్యానించారు. ఈ మూడు పార్టీలు ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు.

## ఆగస్టు 10న మహిళలకు సున్నావడ్డీ కార్యక్రమం

- మొదటి పేజి తరువాయి
సూచించారు. అర్బన్ ప్రాంతాల్లో కూడా డిజిటల్ లైబ్రరీలను తీసుకురావాలన్నారు
చేయూత కింద స్వయం ఉపాధి పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ఆదేశించారు. లబ్ధిదారులు తొలివిడత డబ్బు అందుకున్నప్పుడే స్వయం ఉపాధి కార్యక్రమానికి అనుసంధానం చేస్తే ఆ మహిళకు పూర్తిస్థాయిలో మేలు జరుగుతుందని చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖ కింద చేపట్టే ఉపాధి కార్యక్రమాలపై నిరంతరం సమీక్ష చేయాలని, ఆ కార్యక్రమాల పనితీరుపై మదింపు చేసేందుకు శాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నివేదికల ఆధారంగా ఆ యూనిట్లు విజయవంతంగా నడిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం ఉపాధి కార్యక్రమాల్లో మహిళలకు చేయూతనిచ్చి నడిపిపించడం అన్నది చాలా కీలకమన్నారు.

**జాతీయ ఉపాధిహామీ పథకంపై సీఎంకు వివరాలందించిన అధికారులు.**

- జాతీయ ఉపాధిహామీ పథకంలో ఈ ఏడాది లక్ష్యం 24 కోట్ల పనిదినాలు.
- అయితే జులై నాటికి 18.90 కోట్ల పనిదినాలు పూర్తిచేసిన రాష్ట్ర ప్రభుత్వం.
- జాతీయ స్థాయిలో రాష్ట్రం ఉత్తమ పనితీరు కనపరిచిందన్న అధికారులు.
- మొత్తంగా రూ.9600 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం.
- ఇందులో వేతనాల కింద చేయనున్న ఖర్చు రూ. 3840 కోట్లు.
- గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలపై సీఎం సమీక్ష.
- గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణం దాదాపుగా కొలిక్కి వచ్చిందని తెలిపిన అధికారులు.
- సెప్టెంబరు నాటికి సుమారుగా అన్నింటినీ పూర్తిచేస్తామన్న అధికారులు.
- ఈ సందర్భంగా సీఎం ఇంకా ఏమన్నారంటే...:
- మిగిలిన ఆర్బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, విలేజ్ క్లినిక్స్ నిర్మాణాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్న సీఎం.
- అర్బన్ ప్రాంతాల్లో కూడా డిజిటల్ లైబ్రరీల నిర్మాణంపై దృష్టిపెట్టాలన్న సీఎం.
- వీటికి అవసరమైన స్థలాలను ముందుగా గుర్తించాలన్న సీఎం.
- జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద గ్రామాల్లో సర్వేపైనా సీఎం సమీక్ష.
- 10,943 గ్రామాల్లో ఇప్పటికే డ్రోన్స్ సర్వే పూర్తి అయిందన్న అధికారులు.
- సర్వే పూర్తయిన తర్వాత ఆయా గ్రామాల్లో భూ హక్కుపత్రాలు ఇస్తున్నామన్న అధికారులు.
- జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం విశిష్టమైనదన్న సీఎం.
- ప్రతి గ్రామ సచివాలయంలో సర్వేయర్‌ను నియమించడంవల్ల ఈ ప్రాజెక్టు సజావుగా ముందుకు సాగుతోందన్న సీఎం.
- అలాగే గ్రామ సచివాలయాల్లో కూడా రిజిస్ట్రేషన్ సేవలు కూడా ప్రారంభించిన ఘనత మన రాష్ట్రానికే దక్కుతుందన్న సీఎం.
- జగనన్న కాలనీలపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్న సీఎం.
- మౌలిక సదుపాయాలు దగ్గరనుంచి ప్రతి అంశంలోనూ ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్న సీఎం.
- జగనన్న కాలనీలను ఆహ్లాదంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలన్న సీఎం.
- లక్షల సంఖ్యలో ఇళ్లు కడుతున్నందున మౌలిక సదుపాయాలు విషయంలో రాజీ పడొద్దన్న సీఎం.
- ఇప్పటివరకూ రూ. 32.44 కోట్లు మహిళా మార్టులు వ్యాపారం చేశాయన్న అధికారులు
- రోజూ రూ. 20.62లక్షల వ్యాపారం జరుగుతోందన్న అధికారులు.
- స్వయం ఉపాధి పొందుతున్న మహిళలకు జగనన్న తోడు పథకం ప్రయోజనాలుకూడా వర్తింపు చేయాలన్న సీఎం.
- ఈమేరకు అధికారులు చర్యలు తీసుకోవాలన్న సీఎం.
- ఎస్ఎల్బీసీ సమావేశంలో ఇదే అంశంపై పలుమార్లు బ్యాంకులపై ఒత్తిడి తీసుకు వచ్చి స్వయంసహాయ సంఘాలకు ఇచ్చే రుణాలపై వడ్డీ మేజర్ పార్ట్ 9 శాతం వరకూ తగ్గించగలిగామని , ఇప్పుడు స్త్రీనిధి కింద ఇచ్చే రుణాలపై వడ్డీకూడా 9 శాతానికి పరిమితం చేసేలా చర్యలు తీసుకోవాలన్న సీఎం.
- మహిళలంతా వాయిస్ లెస్ వర్గానికి చెందినవారని, వారి తరపున అధికారులే గట్టిగా మాట్లాడాలన్న సీఎం.

## వచ్చే ఎన్నికల్లో ఓడిపోయి ప్రధాని మోదీ విదేశాల్లో స్థిరపడతారు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామని, విదేశాల్లో ఆశ్రయం పొందాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడటంపై ప్రధాని మోదీ కొన్ని రోజుల కిందట విమర్శలు చేశారు. అది 'క్విట్ ఇండియా' అని ఎద్దేవా చేశారు.
ఈ కూటమిని ఏర్పాటు చేసిన ప్రతిపక్ష పార్టీలు అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ప్రధాని ఆరోపించారు. మోదీ వ్యాఖ్యలపై లాలూ ప్రసాద్ స్పందించారు. 'ప్రధాని మోదీనే దేశాన్ని వదిలేసే ఆలోచనలో ఉన్నారు. ఈ మధ్య ప్రధాని మోదీ ఇన్ని దేశాలను సందర్శించడానికి కారణం ఇదే. పిజ్జాలు, మోమోలు తింటూ ప్రశాంతంగా జీవించే ప్రదేశాన్ని వెతుకుతున్నారు' అని ఎద్దేవా చేశారు.

## కమిషన్ తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- మొదటి పేజి తరువాయి
ఆధారంగా వ్యక్తులు గొప్పవారు కారని.. కేవలం వ్యక్తిత్వం, లక్షణాలే వారి గొప్పతనాన్ని నిర్ణయిస్తాయన్నారు. ముంబయిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ వ్యా ఖ్యలు చేశారు. ఇతరుల నుంచి కమీషన్ తీసుకోవాల్సిన అవసరం తనకు లేదని..యూట్యూబ్ ఛానెల్ నుంచే నెలకు రూ.3 లక్షల ఆదాయం వస్తుందని స్పష్టం చేశారు.
"దేశంలో ఏ ఒక్కరైనా నితిన్ గడ్కరీకి ఒక్క రూపాయి కమీషన్ ఇచ్చినట్లు నిరూపిస్తే.. నేను రాజకీయాల నుంచి వైదొలుగుతా. రాజకీయాలంటే డబ్బులు సంపాదించే వ్యాపారం కాదు. నాకు ఎవరి నుంచి కమీషన్ తీసుకోవాల్సిన అవసరంలేదు. నేను హిందీ, మరాఠీ, ఇంగ్లీష్‌లో చేసిన ప్రసంగాలను యూట్యూబ్‌లో చాలా మంది చూస్తారు. అమెరికాలో ఎక్కువ మంది నా ప్రసంగాలను చూస్తారు. నా యూట్యూబ్ ఛానెల్ నుంచే నెలకు రూ.3 లక్షల ఆదాయం లభిస్తుంది" అని అన్నారు. చిన్నతనంలో పనిచేసేందుకు సుముఖత చూపేవాడిని కాదని, అప్పుడే ఒకరి కింద పనిచేయకుండా.. నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని నిర్ణయించుకున్నట్లు గడ్కరీ చెప్పారు. నా తల్లిదండ్రులు నన్ను న్యాయ విద్య చదవాలని సూచించారు. కానీ, నేను వారికి నా లక్ష్యం గురించి స్పష్టంగా చెప్పాను. కులం, మతం, భాష ఆధారంగా వ్యక్తులు గొప్పవారు కారు. వ్యక్తిత్వం, లక్షణాలే వారి గొప్పతనాన్ని నిర్ణయిస్తాయి. నేను రాజకీయ నాయకుణ్ని. నాకు అన్ని వర్గాల వారి ఓట్లు కావాలి. అందుకే నేను కులం గురించి మాట్లాడను. అన్ని కులాల వారు నా కుటుంబ సభ్యులే, నాకు సోదరసమానులేనని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు.

## ప్రతిపక్ష పార్టీలే పార్లమెంటులో చర్చ జరగకుండా పారిపోతున్నాయి

:పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభ ఒక్కరోజు సజావుగా సాగడం లేదు. మణిపూర్ హింసపై చర్చ చేపట్టాలంటూ ప్రతిపక్షాలు నిరసనలు కొనసాగిస్తున్నాయి. దీంతో రోజూ ఉభయ సభలు వాయిదాల మీద వాయిదాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలపై కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు. పార్లమెంట్ బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మణిపూర్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష పార్టీలే పార్లమెంటులో చర్చ జరగకుండా పారిపోతున్నాయని మండిపడ్డారు. వీధుల్లో నిరసనలు చేయాలని కోరుకుంటే.. పార్లమెంటుకు ఎన్నిక కావడం వల్ల ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. దయచేసి సభకు వచ్చి.. చర్చలో పాల్గొనాలని కోరారు. ప్రతిపక్షాలు కోరిన అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పారిపోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మరోవైపు మణిపూర్‌లో పర్యటించిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు.. పశ్చిమ బెంగాల్‌కు ఎందుకు వెళ్లలేదని అనురాగ్ ఠాకూర్ నిలదీశారు. గతంలో యూపీఏ హయాంలోనూ మణిపూర్‌లో ఆరు నెలలపాటు హింస చెలరేగిందని చెప్పారు. అయినా అప్పటి ప్రధాని, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని విమర్శించారు.

## అసెంబ్లీ సమావేశాలు కనీసం 30 రోజులు నడపాలి

- మొదటి పేజి తరువాయి
వరదలతో నష్టపోయిన ప్రజలు, రైతుల సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు రఘునందన్ రావు. కాళేశ్వరం అప్పులపై సభలో ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ కు ఇవే చివరి సమావేశాలన్నారు. కాంగ్రెస్ వాళ్లు బ్యాంకుల ముందు ఆందోళన చేసి ఏం సాధించారని ప్రశ్నించారు. రైతు రుణమాఫీపై సచివాలయం ఎదుట, అసెంబ్లీ, ఆర్థిక మంత్రి ఇంటిముందు ధర్నాచేయాలని పిలుపునిచ్చారు రఘునందన్ రావు. కాంట్రాక్ట్ ఉద్యోగాలను తీసేస్తామని గతంలో చెప్పిన కేసీఆర్.. సిద్దిపేట జిల్లాలో ఎంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారో చర్చకు రావాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ చుట్టూ అమ్మిన భూములు ఎంత, ఎక్కడెక్కడ ఎంత ఖర్చు చేస్తారో సభలో చెప్పాలన్నారు. మైనారిటీబంధు అందరికీ ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం బీసీలందరికీ బీసీ బంధు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అన్ని నియోజకవర్గాల్లో దళితబంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మి కింద ఇస్తానన్న రూ3లక్షలతో ఇల్లు ఎలా కట్టుకుంటారని ప్రశ్నించారు.

**సీఎం కేసీఆర్ చర్చకు సిద్ధమేనా?**

ప్రభుత్వంపై బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో భూముల అమ్మకం, బీసీ బంధు ఇవ్వలేకపోవడం, మైనార్టీలకు లక్ష సాయంపై సీఎం కేసీఆర్‌కు మీడియా ముఖంగా పలు ప్రశ్నలు సంధించారు. తెలంగాణలో ప్రభుత్వం భూముల అమ్మకాన్ని రఘునందన్ రావు తప్పుబట్టారు. హైదరాబాద్ చుట్టూ శ్మశానాలు అమ్ముతున్నారని కోర్టు స్టే ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. '2014 జూన్ 2 నుంచి హైదరాబాద్ చుట్టూతో పాటు జిల్లాల్లో అమ్మిన భూములెన్ని?, వాటి విస్తీర్ణం ఎంత, దాని ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం ఎంత, ఏ పద్ధతిలో ఎక్కడ ఖర్చు పెట్టారు.' అని రఘునందన్ రావు ప్రశ్నించారు. అలాగే మైనార్టీలందరికి మైనార్టీ బంధు ఇస్తామని మంత్రులు చేసిన వ్యాఖ్యలపైనా రఘునందన్ రావు నిలదీశారు. 'మైనార్టీలు ఎంత మంది ఉంటే అంతమంది మైనార్టీ బంధుకు దరఖాస్తు చేసుకోమని ఓ మంత్రి చెప్పారు. జనభాలో 55 శాతం బీసీలున్నారు. మరి బీసీబంధు అందరికీ ఎందుకు రాదు. ఏ ప్రకారం మైనార్టీలందరికీ మైనార్టీ బంధు ఇస్తామని మంత్రులు చెబుతున్నారు. అది కేబినెట్ తీర్మానమా?. ఎన్నికల అభ్యర్థనా?.. మైనార్టీల ఓట్ల కోసం బుజ్జగించే కార్యక్రమమా?. బీసీలకు ఇవ్వాల్సిన అవసరం లేదా?.. మైనార్టీలకు లక్ష ఇచ్చే మనసున్న సీఎం కేసీఆర్‌కు బీసీలకు బీసీబంధు ఎందుకు ఇవ్వలేకపోతున్నారో చెప్పాలి. ' అని రఘు నందన్ రావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా ఈ అంశాలపై చర్చించేందుకు సీఎం కేసీఆర్, మంత్రులు సిద్ధంగా ఉన్నారా అని రఘునందన్ నిలదీశారు.

## కేటీఆర్... ఇంత విధ్వంసం జరుగుతుంటే సమీక్ష చేసే టైమ్ లేదా?

హైదరాబాద్ :కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సోమవారం ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు లేఖ రాశారు. భారీ వర్షాల కారణంగా చాలామంది నష్టపోయారని, వరదలతో ఇళ్లు కూలిపోయాయని, ఈ నేపథ్యంలో వరద బాధితులకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ వర్షాలకు హైదరాబాద్ అతలాకుతలమైందని, దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అలాగే వరద బాధిత కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సాయం ఇవ్వాలన్నారు. ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూస్తోందని ఉద్దెర ముచ్చట చెప్పడం కాదని, కనీసం ఈ పరిస్థితుల్లో బయటకు రావాలంటే నగర ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. వర్షాల కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయని, దీంతో ఎక్కడ మ్యాన్ హోల్ ఉంది? ఎక్కడ గుంత ఉంది? తెలియక ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని తిరగాల్సి వస్తోందన్నారు. హైదరాబాద్‌ను డల్లాస్, పాత బస్తీని ఇస్తాంబుల్ చేస్తామని ప్రగల్భాలు పలికారని, కానీ వర్షాలకు రోడ్లు నీట మునిగాయన్నారు. భాగ్యనగరంలో ఇంత విధ్వంసం జరుగుతుంటే కనీసం
సమీక్ష చేసే సమయం మంత్రిగా మీకు లేదా? అని ఆ లేఖలో కేటీఆర్‌ను ప్రశ్నించారు. వాతావరణ శాఖ మరోసారి రెడ్ అలర్ట్ ప్రకటించిందని, అయినా ఎలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదన్నారు.

శుభ తెలంగాణ RNI-TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్టుగా రాసే తెలుగు దినపత్రిక
మంగళవారం | మేడ్చల్
1ఆగస్టు 2023
www.subhatelangana.in



# ఫిర్యాదు లేకుండానే మార్గదర్శిపై కేసు పెట్టడం జగన్ పైశాచికత్వం: ప్రత్తిపాటి

- చిట్ పాడిన తక్షణమే డబ్బు చెల్లించే సామర్థ్యం మార్గదర్శికి ఉంది: ప్రత్తిపాటి
- మార్గదర్శి, నారాయణ విద్యా సంస్థలపై వేధింపులకు స్వస్తి పలకాలి: ప్రత్తిపాటి
- పల్నాడులో యువగళం జన ప్రభంజనం సృష్టించబోతుంది: ప్రత్తిపాటి



**శుభ తెలంగాణ పల్నాడు బ్యూరో ఆగస్టు 1:** మార్గదర్శిది 60 ఏళ్లుగా మచ్చలేని చరిత్ర అని, చందాదారుల నుంచి ఒక్క ఫిర్యాదు కూడా లేకపోయినా మార్గదర్శిపై కేసులు పెట్టి వేధించడం అన్యాయమని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ప్రభుత్వ అవినీతిని, తప్పులను ఈనాడు, ఈటీవీ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారనే రామోజీరావుపై కక్షసాధింపులకు పాల్పడుతున్నారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. వినుకొండ నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర ఏర్పాట్లను పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులుతో కలిసి ప్రత్తిపాటి పరిశీలించారు. బహిరంగ సభ జరగనున్న శివయ్య స్తూపం సెంటర్‌తో పాటు రూట్‌మ్యాప్‌ను ప్రత్తిపాటి పరిశీలించారు. యువగళం పాదయాత్రకు జనసమీకరణపై తెదేపా నాయకులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. అనంతరం వినుకొండలోని జీవీ నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ పల్నాడులో యువగళం జన ప్రభంజనం సృష్టించబోతుందని తెలిపారు. రేపు ఉదయం 8 గం.కు ప్రకాశం జిల్లా కెల్లంపల్లి నుంచి పల్నాడు జిల్లా ముప్పరాజువారిపాలెంలోకి లోకేశ్‌బాబు యువగళం ప్రవేశిస్తుందని అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలతో పాటు వేలాదిమంది కార్యకర్తలతో లోకేశ్‌కు ఘనస్వాగతం పలుకుతామని ప్రత్తిపాటి వివరించారు. మార్గదర్శి సంస్థతో పాటు రామోజీరావుపై ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రత్తిపాటి తెలిపారు. ఎలాంటి ఆధారాలు, ఫిర్యాదు లేకపోయినా రామోజీరావుపై కేసు పెట్టారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు లేకుండానే కేసు పెట్టడం వైకాపా పైశాచికత్వం అన్నారు. చిట్ పాడిన తక్షణమే డబ్బు చెల్లించే సామర్థ్యం రామోజీరావుకు ఉందని.. మార్గదర్శిపై దుష్ప్రచారానికి సాక్షి పత్రికలో ప్రకటనలు ఇచ్చి ప్రజా సొమ్మును వృథా చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశంలో అత్యంత విశ్వసనీయత ఉన్న కంపెనీల్లో మార్గదర్శి ఒకటని అన్నారు. రామోజీరావును ఏ విధంగా వేధింపులకు గురిచేస్తున్నారో ప్రపంచంలోని తెలుగు ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. మార్గదర్శిపై ఫిర్యాదు చేయాలని ఖాతాదారులపై ఒత్తిడి తేవడం దుర్మార్గమైన చర్యగా ప్రత్తిపాటి అభివర్ణించారు. మార్గదర్శిపై కక్షసాధించుకోవాలనే దుర్బుద్ధి స్పష్టంగా కనిపిస్తోందని.. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి సీఐడీని వినియోగిస్తున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ తప్పులు చేస్తున్న అధికారులు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారని ప్రత్తిపాటి హెచ్చరించారు. వైకాపా పాలనలో ప్రాజెక్టులను పడకేయించారని.. తెదేపా హయాంలో ప్రాజెక్టులపై వ్యయం చేసిన దాంట్లో 20 శాతం కూడా వైకాపా ఖర్చు పెట్టలేదన్నారు. 2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68,293 కోట్లు ఖర్చు చేశామని ప్రత్తిపాటి తెలిపారు. సీఎం జగన్ కమీషన్లు దండుకొని బిల్లులను మంజూరు చేశారని ప్రత్తిపాటి ఆరోపించారు. తుది దశలో ఉన్న ప్రాజెక్టులను కూడా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రత్తిపాటి వెల్లడించారు. చంద్రబాబు చెప్పినట్లు వైకాపా ప్రభుత్వానికి ఎక్స్‌పైరీ డేట్ దగ్గరకొచ్చిందన్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి మాజీమంత్రి నారాయణపై కక్ష్యసాధింపులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణ విద్యాసంస్థలు దేశంలో 4 లక్షలమంది విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును అందిస్తున్నాయని అన్నారు. రాజధాని ప్రాంతంలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేశారని నిరాధార ఆరోపణలు చేశారని.. పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీని సాకుగా చూపి నారాయణను అరెస్టు చేశారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. జగన్ చర్యలతో లక్షలాది మంది విద్యార్థులకే తీవ్ర నష్టం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలన కంటే ప్రతిపక్షాలపై సాధింపు చర్యలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రత్తిపాటి మండిపడ్డారు. ఇప్పటికైనా విశ్వసనీయత కలిగిన మార్గదర్శి, నారాయణ విద్యా సంస్థలపై అరాచకాలకు, అక్రమ కేసులకు, తప్పుడు రాతలకు స్వస్తి పలకాలని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు.

## అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

- అధిక వర్షపాతం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



**శుభ తెలంగాణ :**అధిక వర్షపాతం వల్ల నష్టపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలి అని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు కమ్మగాని శ్రీకాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అధిక వర్షపాతాల వల్ల రైతుల పంట పొలాలు అనేక ఎకరాలలో నష్టపోవడం జరిగిందని, అదేవిధంగా పత్తి పంట దెబ్బతిన్నదని వాటిని అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలని, గతంలో అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఎకరానికి 10000 ఇస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారని అయినప్పటికీ ఆ పరిహారం ఇప్పటికీ అందకపోవడము ప్రభుత్వ నిర్లక్ష్యముకు నిదర్శనం అని అన్నారు అదేవిధంగా నష్ట పోయిన పంటలకు ప్రభుత్వం ఉచితంగా ఎరువులు అందించాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దొంగరి మహేందర్ ,నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, నియోజకవర్గ సహ కన్వీనర్ సుంకర్నేని కోటేశ్వర్, తొర్రూరు మండల అధ్యక్షులు పల్లె కుమార్, పట్టణ అధ్యక్షులు దుంపల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షులను అభినందించిన ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ షేక్ రియాజ్

- పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం చేసిన షేక్ రియాజ్



**శుభ తెలంగాణ :** కొండపి నియోజకవర్గం 6 మండలాల అధ్యక్షులు కలిసి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. కొండపి నియోజకవర్గంలో ప్రజా సమస్యల కోసం ప్రతినిత్యం మండల అధ్యక్షులు పోరాటం చేసి, ప్రజా సమస్యలు పరిష్కరించి, ప్రజలకు దగ్గరగా ఆత్మీయంగా ప్రేమతో మెలగడం చాలా సంతోషకరమైన విషయం, జనసేన పార్టీని ప్రజల్లోకి చాలా బలంగా తీసుకెళ్తున్నారు, అదేవిధంగా పార్టీలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి జనసేన కిట్లు కూడా మండల అధ్యక్షులుకి ఈరోజు ఇవ్వడం జరిగింది, కొండపి నియోజకవర్గం ప్రజలందరికీ జనసేన పార్టీ అండగా ఉంటుంది, ప్రతినిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న ఆరు మండలాల అధ్యక్షులుకి నా శుభాకాంక్షలు అంటూ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ అభినందనలు తెలియజేశారు. పొన్నలూరు మండలం అధ్యక్షులు కనపర్తి మనోజ్ కుమార్, సింగరాయకొండ మండలం అధ్యక్షులు ఐయినాబత్తిన రాజేష్, టంగుటూరు మండలం అధ్యక్షులు కందుకూరి రాంబాబు, కొండపి మండలం అధ్యక్షులు నాగా విశ్వబ్రహ్మం, జరుగుమల్లి మండలం అధ్యక్షులు గూడ శశిభూషణ్, మర్రిపూడి మండలం అధ్యక్షులు మారిశెట్టి చంద్రశేఖర్ మొదలైన ఆరు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## అబ్దుల్ హకీమ్ కుటుంబానికి 10,000 వేలు ఆర్థిక సహాయం చేసిన ప్రత్తిపాటి ఫౌండేషన్




**శుభ తెలంగాణ :**చిలకలూరిపేట పట్టణంలో 14వ వార్డు లోని అబ్దుల్ హకీమ్ మృత్యువుకు గురి అయినందువలన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సంతాపం తెలిపారు.

వారి కుటుంబానికి అండగా నిలిచి వారికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వార అబ్దుల్ హకీమ్ కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో 14వ వార్డు పార్టీ అధ్యక్షులు బీడింగ్ కరిముల్లా, వార్డు ఇంచార్జ్ ఇబ్రహీం షేక్, మాజీ కౌన్సిలర్ సాయి, రాష్ట్రస్థాయి నాయకులు తుపాకుల అప్పారావు, ఆర్మీ బాజీ, రఫీ, షబ్బీర్, బైక్ మెకానిక్ జానీ భాష తదితరులు పాల్గొన్నారు.

## దిల్ సే ఫౌండేషన్ కు శుభాకాంక్షలు తెలియజేసిన జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్: షేక్ జాన్ సైదా



**శుభ తెలంగాణ :**దిల్ సే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట పట్టణములోని ఎస్ ఎం ఎస్ షాదీఖానాలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా ప్రారంభించారు. దిల్ సే ఫౌండేషన్ ఐదు వసంతాలు పూర్తిచేసుకున్నందుకు సంస్థ సభ్యులకు జాన్ సైదా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, బుజ్జి, మానుకొండ శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగన్నన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్ రెడ్డి




**శుభ తెలంగాణ పల్నాడు బ్యూరో ఆగస్టు 1:**పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగన్నన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్ రెడ్డి.

ఈ స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. బెల్లంకొండ మండలం పాపయపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి ఆంజనేయులు అనే వ్యక్తికి యాక్సిడెంట్ జరిగి మోకాలు దెబ్బతగిలి హాస్పిటల్ లో వైద్యం చేయించుకుంటుగా సదరు యాక్సిడెంట్ చేసిన వ్యక్తి సాయం చేస్తానని చెప్పి ఏమీ పట్టించుకోవడంలేదని తమకు న్యాయం చేయమని ఆంజనేయులు భార్య జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ఎస్పీ కి ఫిర్యాదు చేసినది.

చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన ఫిర్యాది కి వివాహం అయ్యి నాలుగు సంవత్సరాలు అవ్వగా ఫిర్యాది భర్త అయిన నవీన్ కృష్ణ మరియు అతని బంధువులు వివాహం అయిన ఐదు నెలల తర్వాత నుండి అధిక కట్నం కోసం ఫిర్యాది ని శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారని నాకు న్యాయం చేయమని ఒక మహిళ ఎస్పీ కి ఫిర్యాదు చేసింది.

మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన రుద్రమల్ల రామయ్య అను వ్యక్తి పూర్వీకుల కాలం నుండి సుమారు 2.28 ఎకరాల గవర్నమెంట్ భూమిని సాగుచేసుకొనుచుండగా ఆ పొలాన్ని కాజేయాలని ఉద్దేశంతో అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తి మూడు సంవత్సరాల నుండి పంట వేయనివ్వకుండా, పంట వేస్తే దున్నివేస్తూ బెదిరిస్తూ చంపుతామని గొడవలు పెట్టుకుంటున్నారని తనకు న్యాయం చేయమని జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ఎస్పీ కి ఫిర్యాదు చేసినారు.

జగనన్నకి చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు.

స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయసహకారాలు అందించారు. స్పందన కార్యక్రమంలో తమ సమస్యలు విన్నవించుకోవడానికి విచ్చేసిన ప్రజలకు నరసరావుపేట పట్టణానికి చెందిన కె.పి రంగారావు (సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి) నూతనంగా ఏర్పాటుచేసిన భోజనశాలలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవి శంకర్ రెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి (నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు) మరియు ఇతర అధికారులు మరియు అన్నదాన కార్యక్రమం ఆర్గనైజర్స్ బచ్చు వెంకట సత్యనారాయణ స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో అదనపు ఎస్పి( అడ్మిన్) ఆర్. రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పి డి రామచంద్ర రాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి మహేష్, పల్లపు రాజు, ఆదినారాయణ, రవిచంద్ర సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో 01/08/2023 నుండి కొనసాగనున్న "యువగళం" పాదయాత్రను విజయవంతం చేద్దాం...



**శుభ తెలంగాణ పల్నాడు బ్యూరో ఆగస్టు 1:** నారా లోకేష్ "యువగళం" పాదయాత్ర పల్నాడు జిల్లాలో 01/08/2023 నుండి కొనసాగుతుంది. కావున "యువగళం" పాదయాత్రను విజయవంతం చేయవలసిందిగా మీడియా సమావేశం ద్వారా తెలియజేస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు. పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు జి వి ఎస్ ఆంజనేయులు, మాజీ శాసనమండలి చైర్మన్ షరీఫ్ మరియు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహణ కార్యదర్శి ఏం.ధారు నాయక్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.



**శుభ తెలంగాణ** తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో వై యస్ జగన్మోహన్ రెడ్డి గారిని వాసవి సత్రాల సముదాయాలు అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు కలిశారు.

# కబర్దార్ సోయం బాపురావ్

యువజన కాంగ్రెస్ నాయకులు సుభాష్ నాయక్



**శుభ తెలంగాణ** తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి బంజారా గిరిజనులను ఎస్టి జాబితా నుంచి తొలిగించాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు గారు చేస్తున్నటువంటి కుట్రను కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తూ ఉన్నామని యువజన కాంగ్రెస్ నాయకులు సుభాష్ నాయక్ హెచ్చరించారు.దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ఒకే భాష ఒకే వేష ఒకే సాంస్కృతి సంప్రదాయాలు కలిగి ఉన్నటువంటి జాతి బంజారా జాతి అట్లాంటి జాతి పట్ల తన అనుచితమైన ధోరణి అవలంబిస్తూ తెలంగాణ రాష్ట్రంలో కూడా మణిపూర్ లాగా అగ్నిగుండంగా మార్చాలని ఉద్దేశంతో కుట్ర చేస్తున్న సోయం బాపురావును బంజారా నాయకులు హెచ్చరించారు.మరోసారి బంజారా గిరిజనుల జోలికొస్తే నీ అంతు చూస్తామని హెచ్చరిస్తామని లేని పక్షాన దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

# కల్యాణ లక్ష్మీ / షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 320 మంది లబ్దిదారులకు

**కల్యాణ లక్ష్మీ / షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 320 మంది లబ్ధిదారులకు 3,20,37,120 /- మూడు కోట్ల ఇరవై లక్షల ముప్పై ఏడు వేల నూట ఇరవై రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపేణా పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ**



**శుభ తెలంగాణ :**శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్పేట్,చందానగర్, భారతి నగర్ డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 320 మంది లబ్ధిదారులకు 3,20,37,120 /- మూడు కోట్ల ఇరవై లక్షల ముప్పై ఏడు వేల నూట ఇరవై రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపేణా చందానగర్ లోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ మున్సిపల్ కళ్యాణమండపం లో కార్పొరేటర్లు శ్రీమతి మంజుల రఘునాథ్ రెడ్డి , పూజిత జగదీశ్వర్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్ , జగదీశ్వర్ గౌడ్ , ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి లబ్దిదారులకు చెక్కుల ను అందచేసిన ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ . ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు పెద్దన్న మన కేసీఆర్ . కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ తో పేదింట్లో కళ్యాణ కాంతులు నింపిన ఆడబిడ్డల ఆత్మీయ బంధువు మన సీఎం కేసీఆర్ .దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ సంక్షేమ ప్రభుత్వంగా పేరుగాంచిందని, తెలంగాణ పేద ఆడ బిడ్డలకు మీరు ఇచ్చే ఆశీర్వాదాలు, సుఖమయంగా ఉండాలి వాళ్ళ జీవితాలు. ప్రతి పేదింటి ఆడబిడ్డ ని తన సొంత బిడ్డలా భావించి ఆదరించిన మన ప్రియతమ ముఖ్యమంత్రి కేసీఆర్ అని,ప్రతి ఆడపిల్ల కి ఆడపడుచు కట్నం కింద అందించిన గొప్ప పథకం కల్యాణ లక్ష్మి షాదిముబారక్ పథకం అని ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ తెలియచేసారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురికి కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకం కింద చెక్కులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ సంక్షేమ ప్రభుత్వంగా పేరుగాంచిందని, సంక్షేమ పథకాలకు ఏ లోటూ రాకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ పేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందంటే సీఎం కేసీఆర్ పనితీరుకు నిదర్శనం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ గాంధీ అన్నారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంకర్, %=×% శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, బీఆర్ ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు,వార్డ్ మెంబర్లు,ఏరియా కమిటీ ప్రతినిధులు,ఉద్యమకారులు, పాత్రికేయ మిత్రులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు:నాగార్జున రెడ్డి



**శుభ తెలంగాణ మార్కాపురం జూలై31:** ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్కాపురం శాసన సభ్యులు కుందూరు నాగార్జున రెడ్డి అన్నారు. శనివారం పొదిలి నగర పంచాయతీ ఒబులక్కపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాధరణ పొందుతున్నదని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏ స్థాయిలో చెందుతున్నాయో, ఏమాత్రం చెందుతున్న అన్న అంశంపై ఎమ్మెల్యే ఆరా తీసి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ సంక్షేమ పథకాలైన నవరత్నాలు తదితర అంశాలు ప్రజాదరణ పొందుతూ ప్రజల్లో జగన్ పై నమ్మకం కుదిరించుకుంటూ అభివృద్ధి దృష్టిలో పయనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కోసం నాడు నేడు కార్యక్రమం అనేక రకాలైన హామీలను నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,ఎంపీపీ,జెడ్పీ టి సి,మండల కన్వీనర్,సచివాలయం కన్వీనర్,గృహ సారథులు , సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలోనే అసలైన ఆనందం!



**శుభ తెలంగాణ ఒంగోలు జులై 31:** సాటి వారికి సాయపడుతూ సమాజ సేవ చేయటంలో ఉన్న ఆనందం మరేదాంట్లో ఉండదని ప్రజా రచయిత డాక్టర్ మొగిలి దేవ అన్నారు.
నెయ్యి ఇడ్లీ,నెయ్యి దోశతో మస్తాన్ హొటల్ గా జిల్లా ప్రజల మన్ననలు పొందిన మీరావలి తన తండ్రి మస్తాన్ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని,గత పదేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని మొగిలి దేవ అన్నారు.
సోమవారం స్థానిక రిమ్స్ వైద్యశాల ఆవరణలో మస్తాన్ హొటల్ యజమాని మీరావలి,మాధవి దంపతుల కమల పిల్లలైన షేక్ జాహీద్,జాహీర్ ల జన్మదిన వేడుకలు అనాధల మధ్య నిర్వహించారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో కేకు కటింగ్ మరియు శివం ఫౌండేషన్ నిత్య అన్నదాన సంచార వాహనం ద్వారా నగరంలోని 320 మందికి అన్నదానం నిర్వహించారు.
ఈ సందర్భంగా నూర్ బాషా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ మొహిద్దీన్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఈ చిన్నారుల జన్మదిన వేడుకలు ఇలా సేవాభావంతో నిర్వహిస్తున్న మీరావలి అభినందనీయులన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, పెళ్ళి రోజులకు ఆడంబరాలకు పోకుండా ఇలా అనాధలు,అభాగ్యుల మధ్య వారికి తోచిన సాయం అందిస్తూ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదో వార్డ్ కౌన్సిలర్ ను పరామర్శించిన: షేక్ జాన్ సైదా



**శుభ తెలంగాణ పల్నాడు బ్యూరో ఆగస్టు 1 :**రోడ్డు ప్రమాదంలో గాయపడిన 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలిని ఆయన నివాస గృహంలో జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా పరామర్శించారు. మౌలాలిని పరామర్శించిన వారిలో 15 వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, గొంటు శ్రీనివాసరెడ్డి, పట్నం కరిముల్లా, హనుమంతరావు, కరీమ్, ఆశీక్, రఫీ తదితరులు ఉన్నారు.

## తహశీల్దార్ శ్రీనివాస్ రావు కు శుభాకాంక్షలు తెలిపిన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**శుభ తెలంగాణ :**శేరిలింగంపల్లి మండలం లో నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ శ్రీనివాస్ రావు ను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాస్ రావు గారితో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ ప్రభుత్వ భూములను, చెరువులను, కుంటలను, ఎఫ్ టి ఎల్ స్థలాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపనపల్లి తండా వడ్డెర సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, సీనియర్



నాయకులు మన్నే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## షేక్ అబ్దుల్ రావూఫ్ ను పరామర్శించిన జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్: షేక్ జాన్ సైదా



**శుభ తెలంగాణ పల్నాడు బ్యూరో ఆగస్టు 1:**కంటి ఆపరేషన్ చేపించుకున్న చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ మాజీ ప్రతిపక్ష నేత, 5వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ అబ్దుల్ రావూఫ్ ను ఆయన నివాస గృహంలో జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా పరామర్శించారు. మౌలాలిని పరామర్శించిన వారిలో 15 వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, గొంటు శ్రీనివాసరెడ్డి, పట్నం కరిముల్లా, హనుమంతరావు, కరీమ్, ఆశీక్, రఫీ తదితరులు ఉన్నారు.

## రక్త దాన శిబిరాన్ని ప్రారంభించిన: షేక్ జాన్ సైదా....!





**శుభ తెలంగాణ (చిలకలూరిపేట)ఆగస్టు.01:**దిల్ సే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట పట్టణములోని ఎస్ ఎం ఎస్ షాదీఖానాలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా ప్రారంభించారు. దిల్ సే ఫౌండేషన్ ఐదు వసంతాలు పూర్తిచేసుకున్నందుకు సంస్థ సభ్యులకు జాన్ సైదా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, బుజ్జి, మానుకొండ శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## గౌలిదొడ్డి లో రూ.87.50 లక్షలతో చేపడుతున్న భూగర్భడ్రైనేజీ పైపు లైన్ పనులను పరిశీలించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి........



**పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం....**

**శుభ తెలంగాణ :**శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ గౌలిదొడ్డి లో రూ.87.50 లక్షలతో నూతనంగా చేపడుతున్న భూగర్భడ్రైనేజీ పైపు లైన్ నిర్మాణ పనులను ఈ రోజు కాలనీ వాసులతో కలిసి పరిశీలించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి .కాలనీలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి గారు ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రతి కాలనీ,బస్తీలో ప్రజలకు మెరుగైన మౌళికవసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని,ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్ని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. నాణ్యతా విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నిర్ణీత సమయంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆదేశించారు. వర్షపు నీరు,మురుగు నీరు,ఎక్కడ కూడా నిలవకుండా చూస్తామని అన్నారు. ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలియజేశారు అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గౌలిదొడ్డి కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యుఎస్ మేనేజర్ నరేందర్ రెడ్డి, గచ్చిబౌలి డివిజన్ ఉపాధ్యక్షులు తిరుపతి, గౌలిదొడ్డి విలేజ్ అధ్యక్షులు దార్గుపల్లి అనిల్,సీనియర్ నాయకులు ప్రసాద్,బిక్షపతి,రమేష్,బాలకృష్ణ,యాదయ్య, సుధాకర్ రెడ్డి,గౌలిదొడ్డి కాలనీ వాసులు,కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, హెచ్ఎండబ్ల్యుఎస్, సూపర్వైసోర్ రాజు స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్త దాన శిబిరాన్ని ప్రారంభించిన: షేక్ జాన్ సైదా....!



**శుభ తెలంగాణ (చిలకలూరిపేట) ఆగస్టు .01:**దిల్ సే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట పట్టణములోని ఎస్ ఎం ఎస్ షాదీఖానాలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా ప్రారంభించారు. దిల్ సే ఫౌండేషన్ ఐదు వసంతాలు పూర్తిచేసుకున్నందుకు సంస్థ సభ్యులకు జాన్ సైదా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, బుజ్జి, మానుకొండ శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## 500 తగ్గినది అని చూస్తే అంతా మోసమే జరిగింది

- సన్న బియ్యం అని కొంటె పిడిఎస్ బియ్యం ఇచ్చారు
- మోసపోయామని తెలుసు కొని లబోదిబో అంటున్న లింగయ్య



**శుభ తెలంగాణ** ... మండలం కేంద్రంలో తక్కువ రేటుకు సన్న బియ్యం ఇస్తామని ఒక ఆటో తిరుగుతుంది సన్న బియ్యం అని కొంటే...పిడిఎస్ బియ్యం కొని మోసపోయిన హొటల్ నిర్వహకుడు . మండలకేంద్రంలో రావుల లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఆటో పై అమ్మే బియ్యం దళారి క్వాలిటి హెచ్ ఎమ్ టి వరి రకం సన్న బియ్యం క్వింటాలకు 4500 రూపాయలకు ఇస్తు న్నామని చెప్పి మచ్చు బియ్యం చూపించాడని అన్నాడు , అందమైన రైస్ ప్యాకింగ్ బస్తాలపై లేబుల్ వేసి వాటిలో పిడిఎస్ దొడ్డు బియ్యం నింపి సీల్ చేసి, హొటల్ నిర్వహకుడికి, క్వింటా 25 కేజీల బియ్యం అంట కట్టి డబ్బులు తీసుకొని దళారి క్యాష్ చేసుకొని వెళ్లి పోయాడని అన్నాడు , దళారి పోయిన తరువాత 25 కేజీల బ్యాగ్ లు 5 వాటిలో ఓపెన్ చేయగా దొడ్డు బియ్యం చూసి బాదితుడు లబో దిబో అంటూ ఆవేదన తో తెలిపాడు . ఇలాంటి మోసాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. సన్న బియ్యం అమ్ముతూ ఆటోలో వచ్చిన వారిని గమనించి స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పజెప్పాలని కోరారు.

05 శుభ తెలంగాణ RNI-TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్టుగా రాసే తెలుగు దినపత్రిక
మంగళవారం | మేడ్చల్
1ఆగస్టు 2023
www.subhatelangana.in



## రెవెన్యూ అధికారుల అండదండలతోనే చెరువు పూడ్చివేత చెరువులను పరిరక్షించే బాధ్యత తీసుకుంటాను




**శుభ తెలంగాణ** :కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కబ్జా చేసిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్............

– ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చెరువును పునరుద్ధరించడానికి పోరాటం చేస్తా................ గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ లోని గోపనపల్లి గ్రామ పరిధిలో గల సర్వే నెంబర్ 71/1 71/2 సుమారు 5 ఎకరాల 30 గుంటలు విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈద్గావానీ కుంట ను జయవేరి సంస్థ వారు రాత్రికి రాత్రి వందల కొద్ది టిప్పర్లతో చెరువు పూడ్చి వేస్తున్నారని ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి సోమవారం రోజు రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తో కలిసి కబ్జాకు గురైన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయభేరి సంస్థ వారు చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తాం అనే పేరుతో రాత్రికి రాత్రి కబ్జా చేస్తున్నారని, దీనికి పూర్తి బాధ్యత స్థానిక రెవెన్యూ అధికారులదైనని, వైఫల్యం కేంద్రం తోనే, వారి అండతోనే ఈ ఆక్రమణలకు పూనుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలను, చెరువులను కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులకు అండగా నిలబడుతూ ప్రోత్సహిస్తున్నారని, వారికి సమాచారం ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా కబ్జాదారులను వెన్నుదన్నుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై తాము ఇరిగేషన్ అధికారులకు, తసిల్దర్ కు,జిల్లా కలెక్టర్ కు, స్థానిక జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అధికారులను నిలదీస్తే ఇక్కడ పట్టాదారులు ఉన్నారని తాము పట్టాదారులు జోలికి వెళ్ళమని, కబ్జా చేయడానికి పోసిన మట్టికి పెనాల్టీ వేసామని, వారిపై కేసులు కూడా బుక్ చేశామని చెప్తున్నారని తెలిపారు. దాదాపు 300 కోట్ల విలువగల చెరువు స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువును పునరుద్ధరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అధికార పార్టీకి చెందిన వ్యక్తి ప్రోత్బలంతోనే ఈ కబ్జా పర్వం కొనసాగుతుందని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని, జయభేరి సంస్థపై కఠిన చర్యలు తీసుకునే వరకు స్థానిక ప్రజా ప్రతినిధిగా పోరాటం చేస్తానని తెలిపారు

## హత్య కేసులో నిందితుడు అరెస్ట్..




**శుభ తెలంగాణ** :మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ చెందిన చిప్పనపల్లి నాగేంద్రబాబు అను వ్యక్తిని జులై 21న హత్య చేసిన విషయం విధితమే.అట్టి హత్యకు కారణమైన కునుకు సంతోష్ (28) డీసీఎం వ్యాన్ డ్రైవర్ ను సోమవారం నాడు అరెస్టు చేసినట్లు సిఐ బి అశోక్ తెలిపారు.వివరాలలోనికి వెళితే చిప్పనపల్లి నాగేంద్రబాబు తన కొడుకు నామకరణ ఫంక్షన్ లో కనుకు సంతోష్ కు నాగేంద్రబాబు కు మధ్య జరిగిన ఘర్షణని దృష్టిలో ఉంచుకొని నాగేంద్రబాబు ను చంపాలనే ఉద్దేశ్యంతో కనుక సంతోష్ అదే రోజు రాత్రి తన ఇంట్లో ఉన్న రోకలి బండను తీసుకొని నిద్రిస్తున్న నాగేంద్రబాబు తలపై రోకలి బండతో విచక్షణారహితంగా కొట్టడం వలన అతని తలకు బలమైన గాయాలు అయినాయి.గాయాలైన నాగేంద్రబాబు ను కుటుంబ సభ్యులు వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేంద్రబాబు మృతి చెందాడు.అరెస్టు కాబడిన సంతోషం నుండి హత్యకు ఉపయోగించిన రోకలిబండ ని స్వాధీనం చేసుకుని నిందితున్ని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కొట్టుకు హాజరు పరచడం జరుగుతుందని సిఐ బి అశోక్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటప్పయ్య,సూరి తదితరులు పాల్గొన్నారు.

## మేల చెరువు మండల ప్రెసిడెంట్గా గా జీ జయప్రకాష్ నాయక్ నియామకం

- నియామక పత్రం సర్టిఫికెట్ అందజేస్తున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు మంగళ పెళ్లి హుస్సేన్

**శుభ తెలంగాణ :**




జులై 31 సోమవారం నాడు హెడ్ ఆఫీస్ లో జరిగిన సమావేశంలో ఈరోజు జాతీయ మానవ హక్కుల న్యాయ సేవా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సమక్షంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు మంగళ పెళ్లి హుస్సేన్ సూర్యాపేట జిల్లా మేల చెరువు మండలం ప్రెసిడెంట్గా బి జయ ప్రకాష్ నాయకు ను మండల ప్రెసిడెంట్ గా నియమిస్తూ సర్టిఫికెట్, ఐడి కార్డు,ఇచ్చి పత్రికా ప్రకటన తెలపడం జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక కమిటీ సభ్యుడు సామాజిక సేవ చేయాలని సమాజంలో జరుగుతున్న వివక్షతను అరికట్టాలని స్త్రీలపై జరుగుతున్న హత్యలపై అవగాహన కల్పించాలని విద్యా, వైద్య, ఆరోగ్య, న్యాయ,రెవెన్యూ, సమస్యలపై స్పందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని అన్నారు, ఈ సందర్భంగా జయప్రకాష్ నాయక్ మాట్లాడుతూ నాకు అవకాశం ఇచ్చిన అధ్యక్షుడు కి కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు, నా వంతు బాధ్యతతో సామాజిక సేవ చేస్తానని బాధ్యతగా నడుచుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది,

# రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సమీక్ష సమావేశం

- అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం గా ఉండాలి: సైబరాబాద్ సీపీ శ్రీ స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్.,



**శుభ తెలంగాణ** :రానున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు %ఎబశ్రీఅవతీఖఎఆశ్రీఙఎ మీఖజూజూఆఅస్త్ర జుఇవతీఎఅంవం% అనేది పోలీస్ మరియు సివిల్ అడ్మినిస్ట్రేషన్ చేయాల్సిన ప్రక్రియ. దీనికి సంబంధించి సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ఈరోజు పోలీస్ మరియు రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమీక్ష సమావేశంలో సైబరాబాద్ సీపీ శ్రీ స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్., రాచకొండ సీపీ శ్రీ డిఎస్ చౌహన్, ఐపీఎస్., రాచకొండ జాయింట్ సీపీ శ్రీ సత్యనారాయణ, ఐపీఎస్., మేడ్చల్ జిల్లా కలెక్టర్ శ్రీ డి. అమోయ్ కుమార్, ఐఏఎస్., రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ డాక్టర్ ఎస్ హరీష్, ఐఏఎస్., రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్– %×%, శ్రీ ఎస్ తిరుపతి రావు, రంగారెడ్డి జిల్లా %ూాऽऽఎఙఅశీఖశ్రీ జశీశ్రీశ్రీవఙశీతీ–(రాశీఖశ్రీ దీశీऽఅవం%) శ్రీ ప్రతీక్ జైన్, ఐఏఎస్., మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ %ఐ% అదనపు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ.డి.విజయేందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీ. అభిషేక్ అగస్త్య, ఐఏఎస్., సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ శ్రీ సింగే న్వార్ కల్మేశ్వర్, ఐపీఎస్., సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమీషనరేట్లకు చెందిన డీసీపీలు, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లు, %వశ్రీవఙశీతీఖశ్రీ తీవస్త్రఱర్‌తీఙఅశీఅ శీటటఱఎవతీం (జు=ాం%) /ఈఆర్ఓలు, మునిసిపల్ డిపార్ట్మెంట్, తహసిల్దార్లు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ శ్రీ స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్., మాట్లాడుతూ.. సమస్యాతమక ప్రాంతాలను గుర్తించి, ఎలక్షన్ల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా వారి ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని డిపార్ట్ మెంటిలు కలిసి పని చేయాలన్నారు. సమస్యత్మక ప్రాంతాలలో ఎన్నికలను చేసే సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రణాళిక రూపొందిచాలన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నికల వ్యవస్థ పై అనుమానాలు సృష్టించే విధంగా సోషల్ మీడియా లో వచ్చే తప్పుడు ప్రచారాలు చేసే వారిపై సకాలంలో స్పందించే విధంగా సోషల్ మీడియా బృందాలను నియమించాలన్నారు.

రాచకొండ సీపీ శ్రీ డిఎస్ చౌహన్, ఐపీఎస్., మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళి, విధులపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. అదే విధంగా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి వచ్చే అసెంబ్లీ ఎన్నికలను ఏ విధంగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలో క్షుణ్ణంగా వివరించారు.

అనంతరం సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ శ్రీ సింగే న్వార్ కల్మేశ్వర్, ఐపీఎస్., ఎన్నికల నిర్వహణలో %ఎబశ్రీఅవతీఖఎఆశ్రీఙఎ మీఖజూజూఆఅస్త్ర జుఇవతీఎఅంవం% ను ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

మేడ్చల్ జిల్లా కలెక్టర్ శ్రీ. డి. అమోయ్ కుమార్, ఐఏఎస్., మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో టీమ్ వర్క్ తో సమిష్టిగా పని చేయాలన్నారు. ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా నియమావళి ప్రకారం నడుచుకోవాలన్నారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ డాక్టర్ ఎస్ హరీష్, ఐఏఎస్., మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## విద్యా రంగ,ఉపాధ్యాయ సమస్యల ను పరిష్కరించాలి

- తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం
- తొర్రూర్ డివిజన్ కానుక ప్రతినిధి

**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ,సంఘం,ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ లో భాగం గా ఈ రోజు తొర్రూర్ రెవిన్యూ డివిజనల్ కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్ గద్దం సూరయ్య కి వినతి పత్రం అంద జేయడం జరిగింది.ఈ సందర్భం గా జిల్లా అధ్యక్షులు,జంజిరాల.నాగరాజు మాట్లాడుతూ నూతన పిఆర్ సి కమిటీ ని వేసి ఐఆర్ ను ప్రకటించాలని, అదే విధంగా అన్ని రకాల పెండింగ్ బిల్లుల ను వెంటనే విడుదల చేయాలని, అదే విధంగా 317 జిఓ బాధితుల ను వారి యొక్క సొంత జిల్లాల కు వెళ్లే విధంగా చూడాలని,అన్ని రకాల గురుకులా లలో పని చేస్తున్న ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు అందజేయాలని,కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల లో పని చేస్తున్న ఉపాధ్యాయినుల కు టైం స్కేల్ వర్తింప జేయాలని.పాఠశాల లలో శాశ్వత ప్రాతిపదికన స్కావెంజర్ ల నియామకం చేపట్టాలని ఈ సందర్భం గా ప్రభుత్వాన్ని,కోరారు.కార్యక్రమం లో జిల్లా కోశాధికారి బొంగోని బాలరాజు,జిల్లా ఉపాధ్యక్షులు జివిలికపల్లి నరహరి,జిల్లా కార్యదర్శి పులిగుజ్జ యాకయ్య,తొర్రూర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొజ్జ సురేందర్, ఆకోజు అరుణ్ కుమార్, పెద్దవంగర మండల ప్రధాన కార్యదర్శి,కోడూరు.మధుసూదన్ రెడ్డి,దంతాలపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు తెమడ హరిబాబు,మేరుగు రమేష్, నర్సింహులపేట మండల అధ్యక్షులు అమరగొండ మహేందర్ ఉపాధ్యాయులు గుజరాతి.శివకుమార్,నరసింహుల పేట మండల అధ్యక్షులు అమరగొండ మహేందర్ చెన్నోజు.కళ్యాణ్,ఖాదర్,ఉపేందర్,భాస్కర్,విజయ్,శ్రీశైలం,నరసింహులు,రవీందర్,శ్రీనివాస్,ప్రకాష్,పరంధామ,మల్లేశం,నరేష్,సరేందర్,వీరయ్య,తదితరులు పాల్గొన్నారు.



## రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షురాలు ఎన్నిక....

- వరకాంతం మమతారెడ్డి నియామకం.

**శుభ తెలంగాణ** :



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామానికి చెందిన వరకాంతం మమతా రెడ్డిని తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి వలిగొండ మండలం మహిళా,విభాగం,అధ్యక్షురాలుగా నియమిస్తున్నట్లు యాదాద్రి జిల్లా మహిళా విభాగము అధ్యక్షురాలు కంది చంద్రకళరెడ్డి ప్రకటించారు.రాష్ట్ర అధ్యక్షులు గొల్ల బాలు యాదవ్ కి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మ రెడ్డి వెంకట్ రెడ్డికి,రాష్ట్ర కమిటీ సభ్యులు కంది వెంకట్ రాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏనుగు అంజిరెడ్డి, వలిగొండ మండల అధ్యక్షుడు పైళ్ళమల్లారెడ్డి,మహిళా విభాగము అధ్యక్షురాలు కంది చంద్రకళారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి




**ఎస్,ఎఫ్,ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు**

**శుభ తెలంగాణ :** నెల్లికుదురు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్,ఎఫ్,ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా నెల్లికుదురు మండలంలోని విద్యార్థులతో మాట్లాడారు.. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ... మండలంలోని చాలా ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిధిలావస్థకు చేరాయి అన్నారు..అలాగే చాలా పాఠశాలలలో విద్యార్థులకు ముత్ర శాలలు లేవు అన్నారు..మండలంలో మన ఊరు – మన బడి కార్యక్రమం అన్ని పాఠశాల వర్తింపజేయాలి అన్నారు.. అలాగే మండలంలో ని చాలా పాఠశాలలో ఖాళిగా ఉన్న ఉపాధ్యామ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు..మన ఊరు – మన కార్యక్రమం కాంట్రాక్టర్ల పాలు అయింది అన్నారు..మండలంలో ఉన్న పాఠశాలలకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. అలాగే రాష్ట్రంలో, దేశంలో నిత్యావసర ధరలు పెరుగుతున్న విద్యార్థల మెస్,కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో ఎస్,ఎఫ్,ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు అమీర్,నాయకులు వెంకటేష్,మహేష్,నవీన్ పాల్గొన్నారు

## జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

ఎస్,ఎఫ్,ఐ తొర్రూర్ మండల కార్యదర్శి అమీర్



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్,ఎఫ్,ఐ మండల కార్యదర్శి అమీర్ డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు..ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2018 ఎన్నికల మెనిపెస్టో లో జూనియర్ కళాశాలలో అమలు చేస్తానని,విద్యార్థులను మోసం చేశారని అన్నాడు.అలాగే రాష్ట్రంలో చాలా కళాశాలల భవనాలు శిధిలావస్థకు చేరిన,ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు అన్నారు....చాలా కళాశాలలో పెచ్చులు ఊడి ,మీద పడుతున్న ఏమ్ తోచని పరిస్థితిలో విద్యార్థులు ఉన్నారు..జూనియర్ కళశాలలోని విద్యార్థులు ఆటలకు దూరం అయ్యారని అన్నారు..జూనియర్ కళాశాలలో ఖాళిగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు..ప్రభుత్వం కళాశాలలో మధ్యాహ్నం భోజనం అమలు చేయకపోతే,విద్యార్థులను ఏకం చేసి,ఉద్యమం చేస్తానని హెచ్చారించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ నాయకులు జ్యోతి, నాయకులు మహేష్,నవీన్ ,అభిలాష్,ముఖేష్ పాల్గొన్నారు

శుభ తెలంగాణ
RNI-TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్టుగా రాసే తెలుగు దినపత్రిక
మంగళవారం | మేడ్చల్
1ఆగస్టు 2023
www.subhatelangana.in



# ఆ గ్రామంలో కార్యదర్శి ఇష్టారాజ్యం

- సర్పంచ్ కు తెలవకుండా.. రూ.2 లక్షలు డ్రా చేసిన కార్యదర్శి.?
- ఆలస్యంగా వెలుగులోకి..!
- ఓ కార్యాలయానికి వెళ్ళాక అసలు విషయం బహిర్గతం
- ఎంపీడీవో కు తెలిసే జరుగుతుందా.?




**నర్సింహులపేట, శుభ తెలంగాణ** ఓ గ్రామ సర్పంచ్ కి తెలియకుండా పంచాయతీ కార్యదర్శి రూ.2 లక్షలు డ్రా చేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. సాధారణంగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి జాయింట్ అకౌంట్ తో డబ్బులు డ్రా చేయాల్సి ఉంటుంది. ఆ నోట ఈ నోట ఆ విషయం సర్పంచ్ కు తెలిసింది. ఆ కార్యదర్శి ఎలా డ్రా చేస్తారు అనే అనుమానం సర్పంచికి తట్టింది. బిల్లు చేసిన అధికారి దృష్టికి తీసుకెళ్లి అకౌంట్ లో నుంచి రూ.2 లక్షల డ్రా చేసినట్లు, మహబూబాబాద్ ఇంజనీరింగ్ కార్యాలయానికి వెళ్ళగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. స్మశాన వాటికకు సంబంధించి బిల్లును ఇంజనీరింగ్ అధికారులు పనితీరు ఆధారంగా పేమెంట్ చేస్తారు. సుమారు రూ .10 లక్షలు మంజూరు కావాల్సి ఉండగా, విడతలవారీగా పేమెంట్ చేశారు. అందులో ఇటీవల సుమారు రూ.2 లక్షలు గ్రామపంచాయతీ అకౌంట్ లో జమయ్యాయి. దీన్ని ఆసరాగా చేసుకొని ఓ పంచాయతీ కార్యదర్శి సుమారు రూ.2 లక్షల ను సర్పంచ్ కి తెలియకుండా డ్రా చేసినట్లు సమాచారం. ఎఫ్.టి.ఏ ద్వారా డ్రా అయినట్లు తెలుస్తోంది. బ్యాంకుకు వెళ్లేసరికి అసలు విషయం బయటకు వచ్చింది. బ్యాంకు స్టేట్మెంట్ చూసేసరికి సర్పంచ్ కంగు తిన్నారు. బ్యాంకుకు వెళ్లాక సుమారు రూ.2 లక్షల రూపాయలు తేడా కనిపిస్తుంది. డ్రా అయిన డబ్బులు ఎక్కడికెళ్లాయని సర్పంచ్ అధికారుల వద్ద కలవరపడింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెంటనే జమ చేసినట్లు సమాచారం. కొంత అమౌంట్ ను ట్రాన్స్ఫర్ కొట్టించి, మరికొంత అమౌంట్ ను అకౌంట్ లో జమ చేసినట్లు సమాచారం. ఇది ఎక్కడ పోకుండా కార్యదర్శి జాగ్రత్త వహించినట్లు సమాచారం. వాస్తవానికి ఏ బిల్లు, చెక్కు అయినా గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సంతకము కంపల్సరీ. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికీ జాయింట్ అకౌంట్ ను ఓపెన్ చేస్తారు. ఓ అధికారిని "దీక్షా ప్రభ" వివరణ అడగా అది నిజమేనని తెలిపాడు. కొన్ని గ్రామాలలో ఆ పంచాయతీ కార్యదర్శి చెప్పిందే వేదమని, "ఆ కార్యదర్శిని ఎంపీడీవో పల్లెతీ మాట కూడా అనడని" ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఆరోపించడం పలు విమర్శలకు దారితీసింది. కొన్ని గ్రామాలలో ఆ కార్యదర్శి పెత్తనమే చలామణి అవుతున్నట్లు ప్రజా, కుల సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇదంతా ఎంపీడీవో కు తెలిసే జరుగుతుదా.? అనే అనుమానం వివిధ ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో పై చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రాబోవు సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాని పరీక్షించిన జిల్లా కలెక్టర్



**శుభ తెలంగాణ :**రాబోవు సాధారణ ఎన్నికల నేపధ్యంలో ఓట్ల లెక్కింపు కేంద్రానికై సోమవారం జిల్లా కలెక్టర్ హరీశ్ జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, భూపాల్ రెడ్డిలతో కలిసి శంషాబాద్ మండలం పాలమాకులలోని విజయ కృష్ణ ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరీశ్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ, భద్రత పై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.
జిల్లా పౌర సంబంధాల అధికారి రంగారెడ్డి జిల్లా చే జారీ చేయనైనది

## డోర్నకల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా

- కాంగ్రెస్ తరపున ఎల్లకాలం ఆర్థిక సాయం చేయుటకు భరోసా
- మాలోత్ నెహ్రూ నాయక్



**నర్సింహులపేట, శుభ తెలంగాణ :**నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ఆర్థిక సాయం చేస్తానని ఆదివాసి స్టేట్ వైస్ ప్రెసిడెంట్, డోర్నకల్ నియోజకవర్గ బాధ్యులు, పీసీసీ సభ్యులు మాలోత్ నెహ్రూ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నరసింహపురం బంజార శివారు లాలితండకు చెందిన తల్లిదండ్రులు కోల్పోయిన అనాధ పిల్లలైనా హరి ప్రసాద్, జీవన్ కుటుంబానికి రూ. 10 వేలు, గుగులోతు బోడియ కు రూ. 3 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా కాంగ్రెస్ తరపున ఎల్లకాలం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు పిల్లలకు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీ చైర్మన్ మెరుగు సత్యనారాయణ గౌడ్, ఆదివాసీ డిస్టిక్ ప్రెసిడెంట్ లాలూ నాయక్, మండల మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గుగులోతు లలిత, మండల కాంగ్రెస్ నాయకులు గుగులోతు రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు దేవి సింగ్, భూపాల్ సింగ్, నేతావత్ రవి, తదితరులు ఉన్నారు.

## మణిపూర్ లో జరుగుతున్న దాడులకు నిరసనగా క్రైస్తవుల శాంతి ర్యాలీ







**శుభ తెలంగాణ :**(బాల్కొండ నియోజకవర్గ ప్రతినిధి షేక్. యూసుఫ్): నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో సోమవారం ఉమ్మడి బాల్కొండ రీజినల్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మణిపూర్ లో జరిగిన దాడులకు నిరసనగా బాల్కొండ బైపాస్ రోడ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో సత్కరించి, రాజ్యాంగాన్ని గౌరవించాలని దోషులను వెంటనే శిక్షించాలని ఇలాంటి దాడులు మరలా పునరావృతం కాకుండా శాంతి భద్రతలను నెలకొల్పాలని మండల తహసిల్దార్ వినోద్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ రీజినల్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్. పాస్టర్. రాజారత్నం, సెక్రెటరీ పాస్టర్. డేవిడ్ రాజ్, వైస్ ప్రెసిడెంట్. సొలోమోన్ రాజ్ ,ట్రెజరర్ పాస్టర్. స్పర్జన్ రాజ్, సలహాదారులు పాస్టర్. కృప సత్యం ,పాస్టర్. మేషక్ ,పాస్టర్. మలాకి ,బాల్కొండ రీజినల్ పాస్టర్స్ అసోసియేషన్ సేవకులు, విశ్వాసులు, మహిళలు పాల్గొన్నారు.

## మహమ్మద్ పల్లి లో కమ్యూనిటీ కనెక్టివిటీ కాటన్ సెర్చ్



**శుభ తెలంగాణ :**అల్లాదుర్గ్ సీఐ టేక్మాల్ ఎస్సైఆధ్వర్యంలో, హసన్మహమద్ పల్లీ లో ముగ్గురు ఎస్సైలు ఇద్దరు ఏఎస్ఐలు ముగ్గురు హెడ్ కానిస్టేబుల్ 9 మంది కానిస్టేబుళ్లులు టేక్మాల్ మండలం హసన్మహమద్ పల్లీ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో 36 బైక్‌లు, 1 ఆటోను సీజ్ చేసి వారి పత్రాలను సరిచూసుకుని విడిచిపెట్టి సైబర్ నేరాలు, సైబర్ మోసాలు, రోడ్డు భద్రత, హెల్మెట్ వాడకం, బాల్య వివాహాల గురించి వివరించారు.
గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్తులు తమ గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడానికి అంగీకరించారు మరియు వారు ఇన్‌స్టాల్ కెమెరాల కోసం 1,50,000/-, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, 120 నుంచి 130 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేంద్ర బృందం పర్యటనలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ఎంపీపీ టేకుల సుశీల యాదగిరి రెడ్డి**



**నర్సింహులపేట, శుభ తెలంగాణ** గ్రామాలలో కేంద్రం బృందం పర్యటనతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ టేకుల సుశీల యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర బృందం పర్యటనతో చేయవలసిన పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలను నేపథ్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ సోమ్లాల్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీఎం సంజీవయ్య, సీసీ బీముడు, పంచాయతీ కార్యదర్శులు అంగన్వాడీ సూపర్వైజర్లు విద్యాశాఖ, వైద్యశాఖ అధికారులు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం.....

**ముఖ్య అతిథిగా పాల్గొన్న పంజాల రామాంజనేయులు గౌడ్.**

**శుభ తెలంగాణ :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాలులో 37 గ్రామాల నుండి గ్రామ శాఖ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ సమావేశాన్ని దిగ్విజయం చేశారు, ఈ సమావేశానికి ముఖ్య జిల్లా నాయకులు మండల నాయకులు టీపీసీసీ కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ సీనియర్ నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్ గోదా శ్రీనివాస్ మాజీ ఎంపీపీ సత్యనారాయణ జడ్పిటిసి వాకిటి పద్మ అనంతరెడ్డి యుగంధర్ రెడ్డి పబ్బు శ్రీనివాస్ గుండు దానయ్య పలుసం,సతీష్ గౌడ్ వంగాల అశోక్ సామరాంరెడ్డి శ్రీనివాస్ పంజాల రమేష్ పులిపలుపుల రాములు రసూల్ దయ్యాల శ్రీశైలం, బుగ్గ వెంకటేష్ కంచి రాములు ఇతాప రాములు గణేష్ మల్లేష్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిది అది జాతీయ పార్టీ స్వార్ధపరులు పార్టీలోకి వస్తూ ఉంటారు పోతూ ఉంటారు అసలైన కార్యకర్త పార్టీని వదిలి వెళ్లారు ఇది ప్రతి ముఖ్య కార్యకర్త గమనించాలి అని మాట్లాడారు, 37 గ్రామాల నుండి గ్రామ శాఖ అధ్యక్షులు కార్యకర్తలు 300 మంది వరకు భారీ ఎత్తున పాల్గొన్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## తొర్రూరు లో ఈనెల 9న బోనాలు

- మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య.....
- మున్సిపల్ కమిషనర్ సరస్వతి



**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**ఈనెల తొమ్మిదిన బోనాలు నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సరస్వతి తో కలిసి బోనాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యగార్లను విచారించిన తర్వాతనే బోనాల పండుగ 9వ తారీకు బుధవారం నిర్వహించుటకు ఖరారు చేసామని కావున తొర్రూరు పట్టణ ప్రజలందరూ తొమ్మిదో తారీఖున బోనాల పండుగలు జరుపుకోవాలని అన్నారు రుతుపవనాలు ప్రవేశించి వర్షాకాలం ప్రారంభం కాగానే మలేరియా టైఫాయిడ్ విష జ్వరాలతో ఇతర సీజనల్ అంటూ వ్యాధులు ఈ సీజనల్ వ్యాధుల నివారణకు బోనాల పండుగకు సంబంధం ఉందన్నారు వేపాకు క్రిమినశనిగా పనిచేస్తుందని అందుకే రోగ నిరోధక కోసమే ఇంటికి వేపతోరణాలు కడతారని బోనాల కుండకు వేపాకు కట్టడం కాకుండా కున్న మహిళలు వేపాకులు పట్టుకుంటారన్నారు పసుపు నీళ్లు చల్లడం అందుకే మొదలైందని అంటారు భోజనం ప్రకృతి అయితే దాని వికృతి పదమే బోనం అంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎన్నామనేని శ్రీనివాసరావు, కౌన్సిలర్స్ బుసాని రాము, గుగులోత్ శంకర్, కొలుపుల శంకర్, నాయకులు దొంగరి శంకర్, కార్నె నాగరాజు, దరవత్ జైసింగ్, బిజ్జల అనిల్,తూర్పాటి రవి, గుండాల నర్సయ్య,ఎలక్ట్రాకాల్ %రాజు% వంశీ,పురోహితులు యాదగిరి అయ్యగారు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ పేరుతో రజకులకు కమ్యూనిటీ భవనం నిర్మించి ఇవ్వాలి.

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య.
- తొర్రూరు తాసిల్దార్ నాగేంద్రప్రసాద్ కు వినతి.




**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**తొర్రూరు డివిజన్ కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి సాకలి ఐలమ్మ పేరుపై రజక వృత్తిదారుల కోసం రజక కమ్యూనిటీ భవనం నిర్మించి ఇవ్వాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య, సంఘం గౌరవాధ్యక్షులు నల్లూరి రామలింగం లు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ నాగేంద్ర ప్రసాద్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకవృత్తిదారులందరూ వృత్తిని కోల్పోయి జీవనోపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లి బ్రతుకులు వెళ్లదీసుకుంటున్నారని... వృత్తిని కోల్పోయి వలస వెళ్లిన వారికి ఆర్థిక సహకారం అందించి వారి స్వశక్తిపై బ్రతికేలా ప్రభుత్వం వారిని ఆదుకోవాలని వారి కోరారు. బీసీ సామాజిక వర్గ కులాలలో అందరికన్నా వెనుకబడిన సామాజిక వర్గం రజకులే అని వారిని ప్రభుత్వం అన రకాలుగా ఆదుకోవాలని కుల వృత్తుల వారికి ఇటీవల కేటాయించిన ప్రభుత్వ అందజేసే ఆర్థిక సహకారంలో ప్రత్యేక గుర్తింపునిచ్చి ఆదుకోవాలని అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో గల 117 సర్వే నెంబర్ లో గల ప్రభుత్వ భూమిలో రజక వృత్తిదారులకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ పేరుపై కమ్యూనిటీ భవనం నిర్మించి ఇవ్వాలని వారి ప్రభుత్వాన్ని కోరారు. రజకవృత్తిదారులందరూ పేద మధ్యతరగతి కుటుంబాల ప్రజలేనని కమ్యూనిటీ భవనం నిర్మించి ఇస్తే ఎలాంటి ఫంక్షన్లు జరిగినా అందులో జరుపుకోవడానికి వీలుగా ఉంటుంది కాబట్టి తక్షణమే రజక వృత్తిదారులకు కమ్యూనిటీ భవనం నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి వెంకటేష్, తొర్రూరు మండల అధ్యక్ష కార్యదర్శులు నిమ్మల సోమయ్య, పొడగంటి శేఖర్, సంఘం జిల్లా నాయకులు చింతల సందీప్, మధు, ఓరుగంటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల కనీస వేతన చట్టాన్ని మారచిన కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



**శుభ తెలంగాణ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా :**కీసర మండల గ్రామ పంచాయతీ సిబ్బంది గత 26 రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్న వాళ్ల బాధ పట్టనట్టు వ్యవహరిస్తున్న కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి. కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలియజేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, బోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ సందర్భంగా సింగిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి కార్మిక శాఖ మంత్రి అయి ఉండి గత 26 రోజులుగా కార్మికులు చేస్తున్న సమ్మె తనకు పట్టనట్టుగా వివరిస్తున్న మంత్రి మల్లారెడ్డిని ఈసారి ఎలక్షన్లో ఓడించి తగిన గుణపాఠం ప్రజలే చెప్తారని తెలియజేశారు. కరోనా సమయంలో అందరూ ఇంట్లో నుంచి బయటికి రావడానికి భయపడుతుంటే మున్సిపల్ సిబ్బంది రోడ్లన్నీ శుభ్రం చేస్తూ బ్లీచింగ్ చల్లి కరోనా విజృంభించకుండా వాళ్ల కర్తవ్యాన్ని వాళ్ళు నిర్వర్తించారని, అలాంటి వారికి కనీస వేతనం ఇచ్చేవరకు భారతీయ జనతా పార్టీ తరపున మేము వాళ్ళకి అండగా ఉంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొన్న కార్మికులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు అబ్రబోయిన జంగాలు ముదిరాజ్, గోసుల శ్రీనివాస్, నల్ల వెంకటరెడ్డి, బండారి శ్రీనివాస్ రెడ్డి, దుర్గం వేణుగోపాల్ యాదవ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


Edited, Printed, Published & Owned by Sri N.C. Shekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :N.C.Shekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com